క్లుప్తంగా

గెడ్డలు పరిశుభ్రం చేయాలి


జబ్బర్‌తోట వద్ద గెడ్డలు శుభ్రం చేయిస్తున్న జెడ్సీ ప్రసాదరావు

జగదాంబ : వార్డుల్లో గెడ్డలు పరిశుభ్రం చేయాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ పీవీవీడీ ప్రసాదరావు అన్నారు. బుధవారం ఆయన జోన్ పరిధిలో జబ్బర్‌తోట, చెంగల్రావుపేట, గొల్లవారివీధి, చల్లావారివీధి, అగ్రహారం వీధుల్లో పర్యటించారు. ముందుగా ఆ ప్రాంతాల్లో గెడ్డలు, రహదారులను పరిశీలించి సిబ్బందితో శుభ్రం చేయించారు. అనంతరం వార్డులో ఇంటింటికీ వెళ్లి సిబ్బంది పని తీరు గురించి తెలుసుకున్నారు. వీధుల్లోకి క్లాప్ వాహనాలు వచ్చే సమయం గురించి ఆరా తీశారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలన్నారు. చెత్త సేకరణకు మూడు రకాల డబ్బాలు సిబ్బందికి అందజేయాలన్నారు. వీధుల్లోకి రాలేని క్లాప్ వాహనాల కోసం చెత్త సేకరించి ఆయా వాహనాల్లో వేయాలన్నారు. సెక్రటరీల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలన్నారు. ప్రజల తమ ఇళ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పంచామృతాబిషేకం, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉదయం, సాయంత్రం అమ్మవారిని పసుపు, కొత్తచీర, పలు రకాల పుష్పాలతో అలంకరించి పసుపు నీటితో జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాబాయి, చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత విద్య, వైద్యమే ప్రధాన ధ్యేయం'

డాబాగార్డెన్స్ : విద్య, వైద్యం ఉచితంగా అందివ్వడమే ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ ధ్యేయమని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా ఎదుగుదల యాత్రలో భాగంగా బుధవారం విశాఖ విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో జంజనం పద్మ, పఠాన్ భాషా, అమర్లపూడి జోసెఫ్, తోకల శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీటుకు ముస్లింల డిమాండ్

జగదాంబ : ఆంధ్రాలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ముస్లింలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని జనతా బజార్ యూనియన్ నాయకులు అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని స్టేడియం సమీపంలోని జనతా బజార్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు అబ్దుల్ రహీమ్ మాట్లాడుతూ రాజకీయ నాయకులు ముస్లింలను ఓటు బ్యాంక్‌గా చూస్తున్నారు తప్ప వారికి సీట్లు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనతాబజార్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌కు టెన్త్ పరీక్షా పత్రాలు

సీతమ్మధార: ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సెట్-1 పరీక్షా పత్రాలు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చాయి. వాటిని చీఫ్ సూపరింటెండెంట్లు, స్కూల్ అసిస్టెంట్లు పరిశీలించి స్టేషన్‌లో భద్రపరిచారు. ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు నాలుగు సెంటర్లు, ద్వారకా పోలీస్ స్టేషన్‌కు నాలుగు సెంటర్లకు సంబంధించిన పత్రాలు వచ్చాయి.

శివయ్య పూజలకు సన్నద్ధం

- దక్షిణలో ముస్తాబైన భోళా శంకరుని ఆలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు


పాతనగరంలో గల భీమేశ్వరాలయం

భక్తజన వల్లభుడు, భోళా శంకరుడిని ప్రీతిపాత్రంగా సేవించడానికి.. అర్చనలు, అభిషేకాలతో ప్రసన్నుడిని చేసుకోవడానికి, ఉపవాసాలు, జాగరణలతో పార్వతీపతి అనుగ్రహం పొందడానికి అనువైన మహాశివరాత్రి కోసం లోకం సర్వసన్నద్ధమైంది. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు పంచాక్షరీ మంత్ర ప్రతిధ్వనులతో మార్మోగనున్నాయి. శుక్రవారం వేకువ జాము నుంచే మహాశివునికి అభిషేకాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు ఏకాదశ రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. పరమశివుడి దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


వైశాఖేశ్వర ఆలయం

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలోని ప్రధాన శివాలయాల్లో పూజలకు భారీ ఏర్పాట్లు చేశారు. మెయిన్‌రోడ్డులో గల విశ్వేశ్వరాలయంలో వేకువ జాము నుంచే పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరపనున్నారు. సింగ్ హోటల్ జంక్షన్ శివాలయం వీధిలో ఉన్న ఓంకార ఆలయంలో ప్రాతఃకాలం నుంచే ఓంకారేశ్వర స్వామికి అభిషేకాలు జరపనున్నారు. రాత్రి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేయనున్నారు. ఏవీఎన్ కాలేజీలో ఉన్న శివాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, అస్సాం గార్డెన్స్‌లో గల శివరామకృష్ణ ఆలయం, బీచ్‌రోడ్డులో గల కోటీశ్వరాలయం, పెరికివీధిలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు జరపనున్నారు.

ప్రాచీనం..ప్రసిద్ధం..

తరతరాల చరిత్రకు ఆలవాలమైన విశాఖప్నటం.. కాలగతిలో ఎన్నో మార్పులకు లోనైంది. సెలయేటి గమనాన్ని అందిపుచ్చుకుని.. ఒక్కో మలుపు వద్ద ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుని ఇప్పుడు కడలంత కీర్తిని సొంతం చేసుకుంది. ఆనవాళ్లు కూడా దొరకని కాలంలో మామూలు పల్లెగా ఉన్న ఈ ప్రాంతం.. క్రమేణా ఎదిగింది. ఎందరో రాజులు, చక్రవర్తులు, జమీందారుల పాలనలో ప్రాధాన్యాన్ని పెంచుకుంది. ఆయా కాలాల్లో ప్రభువులు దైవ చింతనలో ఏర్పాటు చేసిన ప్రాచీన ఆలయాలకు ఇప్పటికీ నెలవుగా ఉంది. పాతనగరంలో నాటి ప్రాచీన ఆలయాల వైభవం కళ్లెదుట కదలాడుతోంది.

వైశాఖేశ్వర ఆలయం..

14వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని కుళోత్తుంగ చోళుడు పరిపాలించాడు. ఆయన తమ ఇలవేల్పునకు బంగాళాఖాతంలో (కోస్టల్ బ్యాటరీ వద్ద) వైశాఖేశ్వర ఆలయం నిర్మించాడు. ఆ దైవం పేరున విశాఖకు ఈ పేరు స్థిరపడిందని ఓ వాదన ఉంది. అయితే ఈ ఆలయం కాలక్రమంలో సముద్ర గర్భంలో కలిసిపోయింది. దాని నమూనాతో ప్రస్తుతం కలెక్టరేట్ సమీపంలోని ఆఫీషియల్ కాలనీ మూడో వీధిలో నిర్మించిన ఆలయం బుచ్చిరామలింగేశ్వర ఆలయంగా వ్యవహృతమవుతోంది. ఆగ్నేయ ముఖంగా ఉన్న ఈ ఆలంయలో స్వామి స్ఫటిక లింగంగా భక్తులకు దర్శనమిస్తున్నారు.


సూర్యాబాగ్‌లో శతాబ్దాల చరిత్ర గల విశ్వేశ్వరాలయం

400 ఏళ్ల నాటి శివాలయం..

ఇప్పటి దసపల్లా హోటల్ పక్కనే ఉన్న విశ్వేశ్వరస్వామి ఆలయానికి నాలుగు శతాబ్దాల చరిత్ర ఉంది. గతంలో ఈ ప్రదేశంలో ఓ నాగసాధువు మఠం నిర్వహించేవారు. తన శిష్యురాలైన బాదంపూడి వంశీయులతో విశ్వేశ్వరస్వామి మూల విరాట్టును ప్రతిష్ఠింపజేశారు. శివ లింగానికి చేసే అభిషేక జలం తన జీవ సమాధిపై పడేలా ఏర్పాట్లు చేసుకుని స్వామిజీ సజీవ సమాధిలోకి వెళ్లిపోయారు. అందుకే ఈ దేవాలయాన్ని మఠం కోవెలగా వ్యవహరిస్తున్నారు.

భీమ ప్రతిష్ఠితం..

ప్రస్తుతం పాతనగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ చేరువలోని భీమేశ్వరాలయానికి కూడా ప్రాచీన చరిత్ర ఉంది. పాండవులు వనవాసం చేసే సమయంలో భీముడు శివలింగాన్ని ప్రతిష్ఠించాడన్న ఖ్యాతిని పొందింది ఈ ఆలయం. నాలుగు దశాబ్దాల క్రితం పునరుద్ధరణ కారణంగా మరింత గుర్తింపు పొందింది. లోతుగా ఉన్న గర్భగుడిని 1981లో పైకి తీసుకువచ్చి ఆలయాన్ని పునఃర్నిర్మించారు.

ఏవీఎన్ కళాశాలకు 'మాకెన' సోదరుల చేయూత


కరస్పాండెంట్ అదీప్ భానోజీరావుకు చెక్కు అందజేస్తున్న మాకెన సోదరులు

డాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో తరగతి గదుల పునరుద్ధరణకు పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. 164 ఏళ్ల చరిత్ర గల ఏవీఎన్ కళాశాలలో కొన్ని తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు కళాశాల యాజమాన్యం పూర్వ విద్యార్థుల సహకారం కోరింది. యాజమాన్యం పిలుపును అందుకున్న కళాశాల పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. పూర్వ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ జడ్జి మాకెన శ్రీనివాసరావు, ఆయన సోదరుడు మాకెన సీతారామపాత్రుడు రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. దీనిలో భాగంగా రూ.లక్ష విరాళాన్ని కళాశాల వైస్ చైర్మన్, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావుకు బుధవారం అందజేశారు. కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు త్యాగరాజు, నాగేశ్వరరావు, ఐటీ డెవలపర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కళాశాలలో ఐదు తరగతి గదుల పునరుద్ధరణకు ఇంజినీరింగ్ విభాగం రూ.18 లక్షలు అంచనా వేసిందని, ఒక్కో తరగతి గదికి కనీసం మూడు లక్షలు ఖర్చవుతుందన్నారు. ఈ క్రమంలో మాకెన సోదరులు మూడు లక్షలు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని అదీప్ భానోజీరావు పేర్కొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వాసుపల్లి, ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం : జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరయ్యారు. నూతన ధర్మకర్తలుగా లండ రమణ, చుక్క శ్యామ్ సుందర్‌రెడ్డి, కోశెట్టి దేవి, ఎలమలశెట్టి దేవి, కర్రి ధనయమ్మ, కుంచపు ఆదినారాయణ, వాసుపల్లి నారాయణరావు, కణిత గౌరీ, కె. తేజారత్నం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఈవో డీవీఎస్ సురేష్‌బాబాను అభినందించారు. ఇటీవల ఆలయ అభివృద్ధికి సంబంధించి తప్పుడు రాతలు రాస్తున్న ఎల్లో మీడియాను దుయ్యబట్టారు. ఆలయాభివృద్ధికి, భక్తుల వసతుల కల్పనకు కృషి చేయాలని ధర్మకర్తల మండలి సభ్యులకు సూచించారు. అనంతరం సభ్యులు లండ వెంకట రమణను ఆలయ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి కె. శిరీష, ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రి ఏవోగా నారాయణరావు


నారాయణరావును అభినందిస్తున్న సిబ్బంది

మహారాణిపేట : ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి (ఘోష) పరిపాలనాధికారిగా నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పరిపాలనాధికారిగా పని చేసిన సన్యాసినాయుడు ఈ ఏడాది జనవరి 31న పదవీ విరమణ చేశారు. ఖాళీగా ఉన్న ఆ పోస్టులో డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటిండెంట్‌గా పని చేస్తున్న నారాయణరావును పదోన్నతిపై విక్టోరియా ఆస్పత్రి పరిపాలనాధికారిగా నియమించారు. గెజిటెడ్ హోదా రావడంతో నారాయణరావును వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి కార్యాలయ సిబ్బంది అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సూపరింటిండెంట్ (ఇన్‌చార్జి)గా సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్‌ను నియమించారు. ఆయన కూడా బాధ్యతలు స్వీకరించారు.

ధర్మకర్తల మండలి సభ్యులకు సన్మానం


వెంకటేశ్వరమెట్ట దేవస్థానం ఆలయ కమిటీ సభ్యులను సత్కరిస్తున్న అతిథులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరమెట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులను వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయం కార్యవర్గ సభ్యులు సత్కరించారు. బుధవారం సాయంత్రం గ్రంథాలయ కార్యాలయంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొడ్డేటి ప్రసాద్, సభ్యులు కొల్ల సత్యవతి, కొణతాల కృష్ణవేణి, మానస, తాడి అనురాధ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి శరగడం మోహన్, బొడ్డేటి ప్రసాద్ మాట్లాడుతూ కమిటీ సభ్యులు మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ సభ్యులు కోరిబిల్లి త్రినాథ్, సూరిశెట్టి శ్రీను, కోరిబిల్లి శ్యామ్, పాల్తేటి శివ, సూరిశెట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురికి వాసుపల్లి ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట : ప్రజా సేవలో భాగంగా బుధవారం పలువురికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆర్థిక సాయం చేశారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల 35వ వార్డు కల్లుపాకలు ప్రాంతానికి చెందిన కార్యకర్త భర్త చనిపోవడంతో పెద్దకర్మ కోసం రూ.20,000, 38వ వార్డు బుక్కావీధికి చెందిన కార్యకర్త శెట్టి ధనరాజు దహన ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు, 42వ వార్డు వెంకటరాజునగర్ ఉమాదేవి పెనుమత్సకు, 27వ వార్డు దొండపర్తికి చెందిన పసుమర్తి శ్రీనివాసరావుకు, భాగివారివీధికి చెందిన గౌరుసు పద్మకు, 30వ వార్డు కొత్త సాలిపేటకు చెందిన దుండి జగదీశ్వరికి, 36వ వార్డు రంగిరీజు వీధికి చెందిన బంగారు శంకరరావుకు, 36వ వార్డు సున్నపు వీధికి చెందిన మొహమ్మద్ ఫాతిమా బేగంకు, 37వ వార్డు పెయిందొరపేటకు చెందిన తెడ్డు వెంకటలక్ష్మికి, 30వ వార్డు జాలరిపేటకు చెందిన కుర్మణ కొండమ్మకు, 38వ వార్డు బుక్కా వీధికి చెందిన జగదీశ్వరి వెదురుపర్తికి, బ్రహ్మం గారి గుడికి చెందిన మైలపిల్లి గీతికకు, 38వ వార్డు చిన్నమ్మవారి వీధికి చెందిన కొమ్మోజు రామాచారికి, 39వ వార్డు అంబుసారంగు వీధికి చెందిన షేక్ దావిద్‌కు, 41వ వార్డు శివాలయం ఎదురు వీధికి చెందిన బత్తిన రామలక్ష్మికి వాసుపల్లి రూ.5 వేలు చొప్పున అందజేసి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు ధైర్యం కల్పించేందుకు వారిళ్లకు వెళ్లి ఓదార్చి ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. మెడికల్ ఖర్చులు అందజేసేందుకు వారంలో 30 కుటుంబాలకు పైగా కలిసి అండగా నిలుస్తున్నామన్నారు. కార్పొరేటర్లు, మండల ప్రెసిడెంట్లు, వార్డు ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.


గౌరుసు పద్మకు ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి

జయహో బీసీ సభ అట్టర్ ఫ్లాప్

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ నసపల రవీంద్రభరత్


సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రభరత్

డాబాగార్డెన్స్ : జయహో బీసీ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, దక్షిణ నియోజకవర్గ మండల జేసీఎస్ ఇన్‌చార్జి నసపల రవీంద్రభరత్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం ఎన్నికల ముందే బీసీలు గుర్తుకు వచ్చే తెలుగుదేశం పార్టీ.. ఇప్పుడు కొత్తగా బీసీలను ఉద్ధరిస్తామనడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఇప్పటికే అనేక నామినేటెడ్ పదవుల్లోనూ, చట్ట సభల్లోనూ 50 శాతం పైగా బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తాం అనడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని తెలిపారు. బీసీలకు తోలు తీస్తాం.. తోకలు కత్తిరిస్తాం.. న్యాయమూర్తులుగా బీసీలు పనికిరారని చంద్రబాబు అన్న మాటలు ప్రజలు, ముఖ్యంగా బీసీలు ఎప్పటికీ మర్చిపోరన్న విషయాన్ని చంద్రబాబు అండ్ కో గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి గత ఐదేళ్లలో బీసీలకు వివిధ పథకాల రూపంలో రూ.1.78 కోట్లు వెచ్చించిన సంగతిని గుర్తు చేశారు. 6 లోక్‌సభ ఎంపీలు, 4 రాజ్యసభ ఎంపీలు, తొమ్మిది మందికి మంత్రులు, 2 డిప్యూటీ సీఎంలు, 31 మంది ఎమ్మెల్యేలు, 22 మందికి ఎమ్మెల్సీలతో పాటు 90 వేల మందికి వివిధ నామినేటెడ్ పోస్టులు ఇచ్చారన్నారు. బీసీలకు మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని బీసీలు ఎన్నడూ మరచిపోరని చెప్పారు.

అదో అబద్ధాల పుట్ట..


మాట్లాడుతున్న మన్యాల శ్రీనివాస్

తెలుగు దొంగల పార్టీ (టీడీపీ) చేపట్టిన జయహో బీసీ సభ 'ఓ అబద్ధాల పుట్ట' అని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ ఆరోపించారు. మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన జయహో బీసీ సభపై మన్యాల శ్రీనివాస్ స్పందిస్తూ ఎన్నికలు సమీపిస్తున్న వేళలో కపట ప్రేమ చూపించారన్నారు. బీసీలను ఎన్నికలప్పుడు మాత్రమే వాడుకునే చంద్రబాబునాయుడుకు, బీసీలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. చంద్రబాబుని ప్రశ్నిస్తానని పొత్తు పెట్టుకుని పత్తా లేకుండా పోయిన పవన్ కల్యాణ్ మళ్లీ 2024లో రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాధారణ ప్రజలే కాకుండా తెలుగుదేశం, జనసేనకు చెందిన వారు కూడా సంతోషంగా ఉన్నారన్నారు. బీసీలందరూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలు కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలందరూ బాసటగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం..


29వ వార్డులో నాయకులు.. కార్యకర్తలతో సమావేశమైన పీతల వాసు

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డులో బుధవారం బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. వార్డు మండల అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సూచనలతో వార్డు పరిధిలో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం పేరిట కార్యక్రమం నిర్వహించారు. బూత్ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పీతల వాసు పాల్గొని అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అమలు చేస్తున్న సంక్షేమ ఫలాల గురించి బూత్‌స్థాయి నాయకులు నేరుగా ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నీలాపు లక్ష్మి, బెవర మహేష్, కోరాడ సురేష్, బుల్లెట్ రవి, అడప శివ, కనకల రాజు, వాకాడ రాధ, ఎలమంచిలి సంతోష్, శ్రీను, ఆకుల శ్యామ్‌కుమార్, తమ్మినేని శ్రీను, ఇల్లిపిల్లి క్రాంతి, శివ, సారిపల్లి అప్పలరాజు, పైడా వేణుగోపాలరావు, రామకృష్ణ, బొట్టా రాము, మైలపల్లి సూర్యారావు, దొప్ప సూరిబాబు, నందకిషోర్, కమల, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మహిళా ప్రగతితోనే సమాజాభివృద్ధి


దివ్యాంగురాలికి జెరాక్స్ మిషన్ అందజేస్తున్న షిరీన్ రెహ్మాన్, కొల్లి సింహాచలం

జగదాంబ : స్త్రీలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తే సమాజం పరిపుష్టమవుతుందని చైతన్య స్రవంతి అధ్యక్షురాలు షిరీన్ రెహ్మాన్ అన్నారు. బుధవారం వన్‌టౌన్ మత్స్యకార భవనంలో వేదాంత సంస్థ, గాయిత్రి విద్యా పరిషత్ సంయుక్తంగా మహిళలకు నిర్వహిస్తున్న ప్రత్యేక నైపుణ్య శిక్షణ తరగతులను ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేదాంత సంస్థ సామాజిక బాధ్యతగా మహిళలకు పాట్ పెయింటింగ్, మెహందీ, బ్యాంగిల్ తయారీ వంటి స్వయం ఉపాధి కల్పించే అంశాల్లో తర్ఫీదు ఇస్తుందన్నారు. తద్వారా మహిళలు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. అనంతరం కార్యక్రమంలో దివ్యంగురాలు సుమతి స్వశక్తితో ఎదిగే విధంగా వేదంత, చైతన్య స్రవంతి సంస్థల నిర్వాహకులు జెరాక్స్ మిషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం, గాయిత్రి విద్యా పరిషత్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రజని, డాక్టర్ పి.వెంకటకృష్ణ, దిగుమర్తి పల్లవి, డాక్టర్ కె.ఎస్.బోస్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే మహిళా సాధికారత


సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాళ్లు తదితరులు

ఏయూ క్యాంపస్: ఉన్నత విద్యతో మహిళా సాధికారత సాకారం అవుతుందని ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి అన్నారు. ఏయూ దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో బుధవారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ ఓ మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం మొత్తం విద్యావంతులుగా మారుతుందన్నారు. లీ ఫార్మా నిర్వాహకురాలు లీలారాణి మాట్లాడుతూ మహిళలకు విద్య చాలా అవసరమన్నారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సుధా పద్మశ్రీ మాట్లాడుతూ చదువుపై నిరుత్సాహం చూపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఓఎస్డీ వి.కృష్ణమోహన్, దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలు ఆచార్య పల్లవి, క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎస్.విజయమోహన్ పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు


విద్యుత్ దీపాలంకరణలో దుర్గాలమ్మ ఆలయం

డాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గాలమ్మకు విశేష పూజలు, ప్రత్యేక అర్చనలు జరిపారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలో చేపట్టిన దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


ఆలయంలో దీపాలంకరణ